క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ డి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, అన్సారి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక


భానుప్రకాష్ అధ్యక్షుడు


వెంకన్న ప్రధాన కార్యదర్శి

నార్కట్‌పల్లి: టీఎస్ యూటీఎఫ్ నార్కట్‌పల్లి మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్. భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కె. వెంకన్న, ఉపాధ్యక్షురాలిగా ఎస్.పద్మ, ఎఫ్‌డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్‌గా ఆదినారాయణ, కోశాధికారిగా నర్ర రవీందర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు గర్భిణులకు శిక్షణ

నకిరేకల్: హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నకిరేకల్‌లో గల సువర్ణ గార్డెన్‌లో గర్భిణులకు ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామని మఠం నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి అనుభవజ్ఞులైన డాక్టర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరై గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న కార్మికులు

నకిరేకల్ : మున్సిపాలిటీలోని ఒకటో వార్డుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు కార్మికుడు బొడ్డు సైదులు(54) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కార్మికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.34,300 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మకంటి జానకింటి రాములుగౌడ్, తేరాల శ్రీనివాస్, చిన్న శ్రీను, సైదిరెడ్డి, జిడుగు సోమయ్య, గణేష్, సందీప్, అంజయ్య, రాములు, నజీర్, కృష్ణ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో దశరథ మెమోరియల్ ఫౌండేషన్, హరికృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 8, 9, 10వ తరగతికి చెందిన 300 మంది పైగా విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శేఖర్, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా రమేష్


నూతన కార్యవర్గ సభ్యులు

చిట్యాల: పట్టణ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం చిట్యాలలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా మారగోని రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పబ్బతి సత్యనారాయణగౌడ్, కోశాధికారిగా రేగులగడ్డ నర్సింహగౌడ్, ఉపాధ్యక్షులుగా మేకల సురేష్‌గౌడ్, పంతంగి వెంకన్నగౌడ్, ఉయ్యాల మల్లేష్‌గౌడ్, పుల్లెంల చంద్రయ్యగౌడ్, కాసుల సత్యనారాయణగౌడ్‌లు ఎన్నికయ్యారు. పెద్దగౌడ్ మేకల శివగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మారగోని ఆంజనేయులుగౌడ్, గౌరవాధ్యక్షుడు పెద్దగోని మల్లయ్యగౌడ్, మేకల అంజన్‌కుమార్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు మారగోని శ్రవణ్‌గౌడ్, చిన్నగౌడ్, భిక్షంగౌడ్, పల్లె వెంకన్నగౌడ్ ముద్దగోని శ్రీనివాస్‌గౌడ్ మాదగోని వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి

శాలిగౌరారం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్వామి వివేకానంద జయంతిని ఆదివారం యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జిట్టా బాలకృష్ణారెడ్డి, జిట్టా రాధమ్మ ఫౌండేషన్ సహకారంతో ఈ నెల 12 నుంచి 14 వరకు జరగనున్న జిల్లా స్థాయి గ్రామీణ క్రీడోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. భువనగిరిలోని సీఎస్ఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో క్రీడలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపల్లి బంగారయ్య, ఎల్లమల్ల శంరయ్య, జగదీస్, మహేశ్, వెంకన్న, రమేశ్, అజయ్‌కుమార్, మధు, శంకరయ్య, శాంతిస్వరూప్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసనతో ప్రజల అవస్థలు


నాంపల్లిలోని గుర్రంపూడ్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తాచెదారం


ముదిరాజు కాలనీలో శిథిలావస్థకు చేరిన మురుగు కాల్వ

- వీధుల వెంట చికెన్ వ్యర్థాలు
- కంపు కొడుతున్న మురికి కాల్వలు
- ఇబ్బందులు పడుతున్న నాంపల్లి వాసులు

నాంపల్లి : మండల కేంద్రంలోని గుర్రంపూడ్ రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రజలు ఇష్టానుసారంగా చెత్త వేస్తుండడంతో ఆ ప్రదేశం డంపింగ్ యార్డును తలపిస్తోంది. నాంపల్లి గ్రామంలోని పలు కాలనీల వాసులు చెత్తను అక్కడ పడవేస్తున్నారు. చెత్తతోపాటు చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలు రోడ్డు వెంట వేయడంతో వాహనదారులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్ వచ్చే వేళల్లో గందరగోళం

ప్రభుత్వం గ్రామాల్లో చెత్తను సేకరించడానికి ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసింది. కానీ ఆ ట్రాక్టర్ వచ్చే వేళలు తెలియక ప్రజల ఇళ్లల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో వారు రోడ్ల వెంట చెత్త పడవేస్తున్నారు. గతంలో కొన్ని రోజులపాటు ట్రాక్టర్‌కు మైక్ ఏర్పాటు చేశారు. వీధుల్లో వచ్చేటప్పుడు సిబ్బంది మైక్‌తో ప్రజలకు తెలియపర్చేవారు. అది కొద్ది రోజులు మాత్రమే కొనసాగింది. ఆ తర్వాత ఎలాంటి సౌండ్ లేకుండా ట్రాక్టర్‌ను వీధుల వెంట తిప్పి తీసుకెళ్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చికెట్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు

నాంపల్లి గ్రామంలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులకు వ్యర్థాలను, చెత్తను డంపింగ్ యార్డులోగానీ లేక చెత్త సేకరణ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలని, రోడ్ల వెంట వేయవద్దని పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. అయినా చికెన్ సెంటర్ల నిర్వాహకులు నోటీసులను పట్టించుకోవడం లేదని కార్యదర్శి ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని సర్పంచ్, కార్యదర్శి..

నాంపల్లి మండల కేంద్రంలోని ఏపీజీవీబీ వీధి నుంచి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల వరకు ఉన్న మురికి కాల్వ, ముదిరాజు కాలనీ నుంచి పెద్దాపురం రోడ్డు వరకు ఉన్న మురికి కాల్వలు శిథిలావస్థకు చేరాయి. మట్టి, చెత్త కాల్వలో నిండి దుర్వాసన వెదజల్లుతోందని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాల్వ నుంచి బయటకు తీసిన మురుగును అక్కడి నుంచి తీసివేయడం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓపెన్ కాల్వల స్థానంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి గ్రామంలో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు వెంట వెళ్లే పరిస్థితి లేదు



డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ రోడ్ల వెంట చెత్త, వ్యర్థాలను పడవేస్తున్నారు. కుళ్లిపోయిన వ్యర్థాలను కుక్కలు కాలనీల్లోకి తీసుకురావడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు వెంట వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

– ఎదుళ్ల పృథ్విరాజు, నాంపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



మురికి కాల్వలు శిథిలావస్థకు చేరడంతో చెత్త, మట్టి అందులోనే ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కాలనీలో ఉండలేకపోతున్నాం. దీంతోపాటు కాల్వల లోతు ఎక్కువగా ఉండడంతో అందులో చిన్న పిల్లలు పడే అవకాశం ఉంది. గతంలో పలువురు కాల్వలో పడి ప్రమాదాల బారిన పడ్డారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి.

– పన్నాల మల్లయ్య, నాంపల్లి

నోటీసులు అందజేశాం



కాలనీల్లో చెత్త, చికెన్ వ్యర్థాలను రోడ్ల వెంట వేయవద్దని డంపింగ్ యార్డులో, చెత్త ట్రాక్టర్‌లో వేయాలని చికెన్ షాపుల నిర్వాహకులకు నోటీసులు అందజేశాం. కానీ వారు పట్టించుకుండా అలానే వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలి.

– సయ్యద్ బాబా, పంచాయతీ కార్యదర్శి, నాంపల్లి

బుసిరెడ్డి రంగమ్మకు నివాళి


నివాళులర్పిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం బుసిరెడ్డి గూడెంలో బుసిరెడ్డి రంగమ్మ దశ దినకర్మకు బుసిరెడ్డి ఫౌండేసన్ వ్యవస్థాపకుడు బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆదివారం హాజరయ్యారు. రంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆమె కుమారులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటనరసింహారెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కున్‌రెడ్డి రాఘవరెడ్డి, తిరుమలగిరిసాగర్ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాగెండ్ల కృష్ణారెడ్డి, సాగర్‌రెడ్డి, బుసిరెడ్డి పెద్ద వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నూకల రవీందర్‌రెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, శ్రీనాథ్, శ్రీధర్‌రెడ్డి, మల్లికార్జునచారి, ఇస్రం లింగస్వామి, అనుముల కోటేష్, గడ సజ్జన్, అబ్దుల్ కరీం, పాతనబోయిన కోటయ్య పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మాడుగులపల్లి: మండలంలోని కుక్కడం గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డితో కలిసి ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను స్థానిక సర్పంచ్ అలుగుబెల్లి గోవిందరెడ్డి ప్రారంభించి మాట్లాడారు.

అన్ని గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులను నిలుపుతాం


రాజారావును సన్మానిస్తున్న నాయకులు

చండూరు: రాబోయే ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సర్పంచు అభ్యర్థులను బరిలో నిలుపుతామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజారావు పిలుపునిచ్చారు. ఆదివారం మునుగోడు నియోజకవర్గ సమీక్ష సమావేశం చండూరులో జరిగింది. ఈ సమావేశంలో రాజారావు పాల్గొని మాట్లాడుతూ బీఎస్పీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు గండు నాగేంద్రబాబు, మండల అధ్యక్షుడు నేర్లప్రభుదాస్, అసెంబ్లీ కార్యదర్శి అన్నెపాక శంకర్, పల్లేటి వినోద్‌కుమార్, శివాజీ, గ్యార వెంకటేశం, సామ్రాట్ కిరణ్, కదారి సైదులుయాదవ్, చిలక రాజు, శివ చంద్రశేఖర్, బుషిపాక మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తాం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి : సేవా కార్యక్రమాలను స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ముమ్మరం చేస్తామని సంస్థ వ్యవస్థాపకుడు సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం నార్కట్‌పల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు 19 బ్యాచ్‌లు కలిసి స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్–నార్కట్‌పల్లి సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విష్ణు కుటుంబంలోని ఇద్దరు పిల్లలకు సంస్థ ద్వారా రెండు లక్షల రూపాయలు, ఆదిమల్ల లోకేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పిల్లలకు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, వందేమాతం ఫౌండేషన్, నిర్మాణ ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్, వనం మహేష్, ఉపాధ్యాయులు వనజాత, పృథ్విరాణి, ఉదయశ్రీ, యాదరిగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయం


లింగయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

శాలిగౌరారం: ఎంసీపీఐ(యు) జిల్లా నాయకుడు, నకిరేకల్ సమితి మాజీ అధ్యక్షుడు పనికెర లింగయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శాలిగౌరారం మండలంలోని గురుజాల గ్రామంలో ఆదివారం పనికెర లింగయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా లింగయ్య విగ్రహం, స్థూపం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల వీరేశం, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని రజాకార్ల ఆగడాలను నిలువరించిన లింగయ్య గొప్ప పోరాట నాయకుడన్నారు. ఎంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి, కేంద్ర కమిటీ సభ్యులు వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, నజీర్, గోపి, కాశీ, సైదమ్మ, సింగిల్ విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, సర్పంచ్ గుండా శ్రీనివాసులు, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు అన్నెబోయిన సుధాకర్, ఎర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని మేళ్ల దుప్పలపల్లి రోడ్డులో ఆలయం, స్కూల్, లెప్రసీ హాస్పిటల్ ఉన్నందున స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక 7వ వార్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మారగోని నగేష్, షేక్ మహబూబ్‌అలీ, చింతల శోభన్, ఉంగరాల సైదులు, మారగోని యాదయ్య, మారెపల్లి సత్తయ్య, రహీమ్, శేఖర్, శివ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న ఎన్జీ కళాశాల పూర్వ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి లెక్చరర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి కళాశాల ప్రెసిడెంట్ చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, ఎంవీ గోనారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి


నకిరేకల్ : క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్‌లో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిత్రబోయిన లక్ష్మయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు కంచర్ల అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రుద్రాక్ష శ్రీనివాస్, ప్రతినిధులు బంటు నరేందర్, కాసర్ల లింగారెడ్డి, గజ్జల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిట్యాల: రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆదివారం చిట్యాలలో విడుదల చేశారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య, నలపరాజు శేఖర్, తీగల కృష్ణయ్య, అమరోజు రాములు, వెలిమినేడు అంజయ్య, నలపరాజు సైదులు, ఐతరాజు శంకర్, సైదులు పాల్గొన్నారు.

చండూరు : గౌడ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కంఠమహేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం సంఘం అధ్యక్షుడు భీమనపల్లి శేఖర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మొగుదాల శేఖర్, ఉపాధ్యక్షులు పందుల సత్యం, బెల్లంకొండ శేఖర్, బోయపల్లి రోశయ్య, మాద బుచ్చయ్య, చనగాని పెంటయ్య, బొల్లపల్లి శీను, కమిటీ సభ్యులు మొగుదాల చిన్న దశరథ, మొగుదాల వెంకన్న, చనగాని కిరణ్, మామిడి రాజు, చనగాని కిరణ్, బోడ మోహన్, బోడ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ నామని జగన్నాథం, నామని బుచ్చయ్య, చెరుపల్లి ఆంజనేయులు, పున్న కిషోర్, సామల యాదయ్య, జెల్ల మారయ్య, కృష్ణ, జెల్ల విష్ణు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర అక్షింతల పంపిణీ



నల్లగొండలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు, అక్షింతలు పంచుతున్న సభ్యులు

రామగిరి(నల్లగొండ): అయోధ్య రామమందిరం అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల వేంకటేశ్వర ఆలయం నుంచి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు కాలనీలో ఇంటింటికీ తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి వెంకటయ్య, ఇటికాల కృష్ణయ్య, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, నూకల జైపాల్ రెడ్డి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.


కట్టంగూర్ : అక్షింతలు పంపిణీ చేస్తున్న ఆలయ పూజారి శ్రీనివాసశర్మ

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం అయోధ్య రామ మందిర అక్షింతలను ఆలయ పూజారి శ్రీనివాస శర్మ మండలంలోని పలు గ్రామాల ఆలయ కమిటీ చైర్మన్లకు, భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు వేయి కనులతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. అంతకుముందు గ్రామంలో సీతారాముల విగ్రహాలు, అక్షింతల కళశాలతో శోభాయాత్ర నిర్వహించారు. పూజారి కోటారు సత్యనారాయణశర్మ, కోమటి భాస్కర్, గోపి, వేణుమాధవ్, పెద్ది బాలనర్సింహ, రెడ్డిపల్లి సైదులు, చంద్రయ్య, హరిబాబు, రమేష్, చంద్రయ్య, సంధ్య, శోభ, నాగమ్మ, మంగమ్మ ఉన్నారు.

గుర్తింపు ఉన్న సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలి


కేక్ కట్ చేస్తున్న శ్రీశైలం యాదవ్

నల్లగొండటౌన్: ప్రజలు గుర్తింపు ఉన్న సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని శ్రీకృష్ణ మ్యాక్స్ కోఆపరేటివ్ సొసైటీ అండ్ ఫినో పేమెంట్ బ్యాంక్ ఎండీ. శ్రీశైలంయాదవ్ అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన బ్యాంక్ 5వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ప్రజలు, ప్రైవేటు యాప్స్, ఫైనాన్స్‌లలో అధిక వడ్డీకి రుణాలు తీసుకుని నష్టపోవద్దన్నారు. తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు ఉన్న సొసైటీల్లో సభ్యత్వం తీసుకుని పొదుపు, రుణ అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. సొసైటీ సేవలతోపాటు ఫినో పేమెంట్ బ్యాంకు ద్వారా సేవింగ్, కరెంట్ అకౌంట్స్‌ను ప్రతి గ్రామంలో సొసైటీ సభ్యులకు అందుబాటులో ఉంచామన్నారు. బ్యాకింగ్ ఇన్సూరెన్స్ సేవలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఇన్సెంటివ్, అవార్డులను సభ్యులకు అందజేశారు. ఈ సమావేశంలో సమునతి ఇంటర్‌మీడియేషన్ లి. ఏపీ, తెలంగాణ రాష్ట్ర మేనేజర్ ఎస్.కె. షరీఫ్, ఫినో పేమెంట్ బ్యాంకు తెలంగాణ రీజనల్ హెడ్ సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సినీ నటి పావలా శ్యామలకు సాయం


సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : సినీ నటి పావలా శ్యామలకు నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పావలా శ్యామల ఉంటున్నారు. 30 ఏళ్ల సినీ జీవితంలో 3వేలకు పైగా నాటకాలు, 350 పైగా సినిమాల్లో ఆమె నటించింది. నేడు పేదరికానికితోడు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. తనకు బిడ్డ ఉన్నా కాలు విరిగి మంచానికి పరిమితమైంది. అటు వైద్యానికి డబ్బులు లేక పేదరికంతో కడుపు నింపుకోవడమే కష్టంగా జీవనం గడుపుతోంది. విషయం తెలుసుకున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు ఆదివారం ఆమె దగ్గరకు వెళ్లి రూ.20,200 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, తాటి మురళి, బొడుకంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేధిస్తున్న విద్యుత్ సమస్యలు !

- ప్రమాదకరంగా విద్యుత్ లూజ్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న తిప్పర్తి ప్రజలు



చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో విద్యుత్ సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించడం లేదు. దీంతో అధికారులపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిప్పర్తి మండల వ్యాప్తంగా గ్రామాల్లో, వ్యవసాయ భూముల్లో విద్యుత్ లూజ్ లైన్లు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటివల్ల ప్రాణ నష్టం కూడా జరుగుతోంది. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

తిప్పర్తి మండల వ్యాప్తంగా విద్యుత్ లూజ్ లైన్ల సమస్య తీవ్రంగా ఉంది. సంవత్సరాల క్రితం వేసిన కరెంటు స్తంభాలు శిథిలమైపోవడం వల్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. కొన్నిచోట్ల కరెంటు తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. వేలాడుతున్న తీగలు తగిలి అనేక మూగజీవాలు మృత్యువాత చెందాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. అదేవిధంగా తిప్పర్తి మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. తిప్పర్తి సెంటర్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై ఉంది. దాంతో పాటు అదనంగా రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా వాటిని ఏర్పాటు చేసే పనులు ఇంకా మొదలుపెట్టడం లేదు. దీంతో తిప్పర్తి ప్రజలు విద్యుత్‌లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్నా



మా వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. కరెంటు స్తంభాలు దూరం అవడం వల్ల వైర్లు కిందికి వంగిపోయాయి. కరెంటు తీగలు తగలడం వల్ల ఇటీవల గేదె చనిపోయింది. రెండు సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– వంటిపాక యాదయ్య, బుసిరెడ్డిగూడెం

కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం

తిప్పర్తి మండల వ్యాప్తంగా లూజ్ లైన్ల సమస్య తీవ్రంగా ఉంది. కరెంటు స్తంభాల మరమ్మతులు బడ్జెట్ లేకపోవడం వల్ల పనులు చేయకలేకపోతున్నాం. తిప్పర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఆరు నెలల క్రితమే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం. స్థానికులు సహకరించకపోవడం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయి.

– రమ్య, ఏఈ, తిప్పర్తి